

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బండి రమేష్

రేవంత్‌రెడ్డి పాలనలో అందరికీ న్యాయం

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ చేయడం చారిత్రాత్మక విషయమన్నారు. ఈ కార్యక్రమంలో విశాల్ సుధాం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు రామ్మోహన్

నిత్యావసర సరుకుల పంపిణీ

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా బీజేపీ నాయకుడు వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని పలు బస్తీల వాసులకు నిత్యావసర సరుకులు, చీరలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం కుటుంబం ఆనందంగా రంజాన్ వేడుకలు చేసుకోవాలనే ఉద్దేశంతోనే నిత్యావసర వస్తువులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పిద్దాం

- సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బాలికలకు రక్షణ కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు భరోసా కల్పిద్దామని ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవ్ ద గర్ల్ చైల్డ్ కార్యాలయాన్ని చంచల్ గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే బక్కిని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై రోజురోజుకు అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను ధైర్యంగా పెంచాలని, అబ్బాయిలను బాధ్యతగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళింగ కృష్ణ, డా. స్రవంతి, డాక్టర్ చక్రపాణి, సౌజన్య, గీత, స్వప్న, అపర్ణ, శరణ్య, సునీత, హిమబిందు, పద్మజ, కొమటి రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తేలి, సాహు, గాండ్ల కులస్థుల చలో ఢిల్లీ

పంజాగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా తేలి, సాహు, తెలంగాణలో గాండ్ల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అఖిల భారత తైలిక్ సాహు మహాసభ జాతీయ అధ్యక్షుడు జయదత్ క్షీరసాగర్ వెల్లడించారు. ఆదివారం సోమాజిగూడలోని అఖిల గాండ్ల తెలికుల ట్రస్టు భవన్‌లో జరిగిన మహాసభ జాతీయ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాలలో మహిళా చైతన్య ర్యాలీలు, పురుషుల సమస్యల మీద ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 25న లక్షలాది మందితో నిర్వహించనున్న కర్మమాత జయంతి బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరుకానున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

అమీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సిటీ బస్సు ఎర్రగడ్డ బస్టాపు వద్దకు రాగానే నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీ కొట్టింది. దీంతో అతడు బస్సు చక్రాల కింద పడ్డాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు మద్యం తాగి ఉన్నాడని, అతడి వయసు 35 ఏళ్లు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. పేరు అమర్‌సింగ్ అని చెప్పాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

నిరాశ్రయులకు నిత్యం వేధింపులే

- సమస్యలకు నిలయంగా బేగంపేట నైట్ షెల్టర్
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సిబ్బంది
- పట్టించుకోని అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరాశ్రయులు

బేగంపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ పరిధిలోని నైట్ షెల్టర్ సమస్యలకు నిలయంగా మారింది. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అక్కడున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సిబ్బంది మెప్పు పొందిన వారికే రెండు పూటలా భోజనం ఉంటుందని, లేదంటే ఒక పూటే భోజనం పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ మరుగుదొడ్లు ఉన్నా నిత్యం తాళం వేసి ఉంటున్నారు. నైట్ షెల్టర్‌లో ఉంటున్న వారు మురుగుదొడ్ల కోసం కిలో మీటరు దూరంలో లైఫ్‌స్టైల్ ఎదురుగా ఉన్న మరో నైట్ షెల్టర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ ఉన్న మరుగుదొడ్లను సిబ్బంది మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఆ తర్వాత వాటికి తాళం వేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే షెల్టర్ నుంచి పంపిచేస్తామంటూ సిబ్బంది బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వారు తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పర్యవేక్షించాల్సిన యూసీడీ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ బాధ్యతలు చూస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్లక్ష్యంతో నైట్ షెల్టర్ సమస్యలకు నిలయంగా మారింది.



బేగంపేట నైట్ షెల్టర్

అన్నం పెట్టడంలోనూ వివక్షే

అనాథలకు ఆశ్రయం కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలోని పలు చోట్ల నైట్ షెల్టర్లను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణను అమన్ వేదిక అనే ఎన్‌జీఓకు ప్రభుత్వం అప్పగించింది. వీటి పర్యవేక్షణను జీహెచ్ఎంసీలోని యూసీడీ విభాగం చూస్తోంది. అయితే దాతల సహాయంతో ఎన్‌జీఓ సంస్థ ఈ నైట్ షెల్టర్లను నిర్వహిస్తుండగా దీనికి కావల్సిన కనీస సౌకర్యాలను జీహెచ్ఎంసీ కల్పిస్తుంది. ఇక్కడ రెండు నైట్ షెల్టర్లు ఉండగా.. ఒక దాంట్లో రోగులు ఉంటున్నారు. మరో దాంట్లో అనాథలు ఉంటారు. అనాథలు ఉంటున్న నైట్ షెల్టర్‌లో సిబ్బంది వేధింపులతో చాలా మంది ఇప్పటికే ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. దాతల సహాయంలో ఇక్కడ ఉన్నవారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం పెడతారు. ఇక్కడ ప్రస్తుతం 25 మంది వరకు ఉన్నారు. వీరిలో కొందరు దివ్యాంగులు సైతం ఉన్నారు. అయితే వారిలో కొందరికి ఒకే పూట భోజనం పెడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇక్కడ రూల్స్ ఇలానే ఉంటాయని.. ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోమంటూ సిబ్బంది దురుసుగా సమాధానం చెప్పడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నైట్ షెల్టర్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం ఇక్కడ ఉన్న వారందరికీ భోజన వసతి కల్పిస్తున్నాం. సిబ్బంది వ్యవహార శైలిపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తాం. నిజమని తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం. మరుగుదొడ్లకు తాళం వేశారనే విషయం మా దృష్టికి రాలేదు. స్వయంగా సెంటర్‌కు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తా.

\- దయాకర్, యూసీడీ అధికారి

'దావత్ ఏ ఇఫ్తార్'ను రద్దు చేయాలి

- ప్రభుత్వాన్ని కోరుతున్న జస్టిస్ చంద్రకుమార్
- ఆ డబ్బును అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచన

పంజాగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రజాధనంతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో హంగు, ఆర్భాటాలతో నిర్వహించే దావత్ ఏ ఇఫ్తార్ విందును రద్దు చేయాలని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ కోరారు. పండుగల పేరుతో దుబారా ఖర్చు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సామాజిక ఉద్యమకారిణి సొగరా బేగం అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ వర్గాలకు చెందిన వారు పాల్గొని మాట్లాడారు. రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందుతో సుమారు 70 కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన పద్ధతిని ప్రస్తుత ప్రభుత్వం అనుసరించవద్దని పలువురు వక్తలు కోరారు. ప్రజాధనాన్ని వృథా చేయకుండా ప్రజాప్రతినిధులు తమ సొంత డబ్బులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇఫ్తార్ ఎలా జరగాలో తమ మత గ్రంథంలో రాసి ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు లుబ్నా సర్వత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్‌ను రద్దు చేయాలని ఇప్పటికే సీఎంకు లేఖ రాసినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అయేషా ఫాతిమా, ఖుద్సియా తబస్సుమ్, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ రఫీ, దాస్ రామ్ నాయక్, షేక్ సాహిదా బేగం, సనాఉల్లా ఖాన్, సైరా భాను, అబ్దుల్ జబర్ హైమద్ మతిన్, స్నేహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

బీజేపీ నేతను పరామర్శించిన గవర్నర్ దత్తాత్రేయ

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్‌ను ఆదివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. అమీర్‌పేట శివబాగ్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజాసేవతో పాటు ఆరోగ్యంపై సైతం దృష్టి సారించాలని శ్యామ్‌సుందర్‌కు సూచించారు. శ్యామ్‌సుందర్ త్వరగా కోలుకుని ప్రజలకు చేరువగా ఉండి మరింత సేవ చేయాలని దత్తాత్రేయ పేర్కొన్నారు.



శ్యామ్‌సుందర్ గౌడ్‌ను పరామర్శిస్తున్న దత్తాత్రేయ

ఉచిత వైద్య శిబిరం



బేగంపేట డివిజన్‌లోని మయూరిమార్గ్‌లో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మహేశ్వరి, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్ తదితరులు

\- బేగంపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి)



షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న సినీ నటి నిధి అగర్వాల్

పంజాగుట్టలో నిధి అగర్వాల్ సందడి

బేగంపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటి నిధి అగర్వాల్ పంజాగుట్టలో సందడి చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఓ వెండి లగ్జరీ ఆభరణాల షోరూంను నిధి అగర్వాల్ ఆదివారం ప్రారంభించారు. షోరూంలోని ఆభరణాలను పరిశీలించడంతో పాటు వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వేణు రాచకొండ, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన బిహారీలు

ఉత్సాహంగా బిహారీ దివస్

ఖైరతాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరానికి వలస వచ్చి వివిధ రంగాల్లో స్థిరపడ్డ బిహారీలంతా ఓ చోట చేసి వేడుకలు చేసుకున్నారు. బిహారీ దివస్ సందర్భంగా బిహారీ, ఫౌండేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో వీపీ నర్సింహారావు మార్గ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో వేడుకలు నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సరదాగా గడిపారు. బాండింగ్, బ్రాండింగ్, బిజినెస్ నినాదంతో జరిగిన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్ సుల్తానియా ముఖ్య అతిథిగా హాజరై సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి కళాకారులను అభినందించారు. బిహారీ వ్యాపారవేత్తలు, వైద్యులు, ఇతర ప్రముఖులను సత్కరించారు. కార్యక్రమ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు విశ్రాంత ఫారెస్ట్ అధికారి మునీంద్ర, బిహార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరేరాం సింగ్, కార్యదర్శి ఉత్తమ్ యాదవ్, నిర్వాహక కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, ప్రణబ్, దశరథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓజీ కుష్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఓజీ కుష్ (హైడ్రో వీడ్) విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలో చల్లా నారాయణ శ్రీనిధి అనే వ్యక్తి ఓజీ కుష్ విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 101 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లికి చెందిన నరేందర్‌కుమార్ నుంచి ఓజీ కుష్ కొనుగోలు చేసినట్లు నారాయణ చెప్పడంతో నరేందర్ ఇంటిపై ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం దాడి చేసింది. అతడి ఇంట్లో 102 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది నరేందర్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లలో అప్పగించారు.



స్వాధీనం చేసుకున్న ఓజీ కుష్

నిమ్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ అడ్మినిస్ట్రేషన్ విభాగం మొదటి పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించింది. ఆదివారం ఆసుపత్రి లెర్నింగ్ సెంటర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వంద మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆరోగ్య సంరక్షణ పరిపాలన విద్యలో 35 సంవత్సరాల అత్యుత్తమ ప్రతిభను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైద్య సూపరింటెండెంట్లు డాక్టర్ పులిజాల సత్యనారాయణ, డాక్టర్ ఇందిరా వెంకట్రామన్, మెడికల్ సూపరింటెండెంట్, ప్రొఫెసర్, ఆసుపత్రి పరిపాలన విభాగాధిపతి డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ ఎస్.లక్ష్మీభాస్కర్, డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి, డాక్టర్ రాకేష్ నరిమేటి, డాక్టర్ చరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

'వాక్ ఫర్ హోప్'తో వృద్ధులకు ఆసరా



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి

పంజాగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఏ న్యూ విజన్ ఫర్ సోషల్ అసిస్టెన్స్ (ఏఎన్వీఎస్ఏ) సోషల్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తెలుగు రాష్ట్రాలలో వృందా హోమ్ పేరుతో రెండు వృద్ధాశ్రమాలను నిర్మించనుంది. వాటి భవన నిర్మాణాలకు ఆర్థిక సహాయం కోసం ఆదివారం నెక్లెస్ రోడ్డులో వాక్ ఫర్ హోప్ పేరుతో వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను ఎంఎల్ఆర్ఐటీ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో వివిధ సంస్థలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఎంఎస్ జుంబా ప్రదర్శనతో ప్రారంభమై, రాగమాలిక బ్యాండ్ అందించిన సంగీతంతో ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ.. వృందా హోమ్ ఒక భవనం కాదని, ఇది అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడంతో పాటు ఎలాంటి ఆసరా లేని వృద్ధులకు ఓదార్పు ఇస్తుందన్నారు. దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ వాకథాన్ ద్వారా సమీకరించిన నిధులతో వృందా హో నిర్మాణం జరగబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో అభిరామ్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు అభిరామ్, డాక్టర్ గీత త్రిపాఠి, నవనీత, శివరంజని చింత, డాక్టర్ సూర్యప్రకాష్ రావు, ఉదయ్, హైమ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రవిశేఖర్ రెడ్డి తదితరులు



అమీర్‌పేట సత్యం టాకీస్ చౌరస్తాలో నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

పంజాగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల వయసులోనే అలుపెరగని పోరాటం చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసి ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ వీపీ రవిశేఖర్ రెడ్డి అన్నారు. అమరవీరుల దినోత్సవం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్ వెంకటరమణ కాలనీలో భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్, కార్యదర్శి గంగులు, సభ్యులు నాగేష్, బాబులేష్, నాగేందర్, రెహాన్, నాగరాజు, భరత్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేటలో..

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): షహీద్ దివాస్‌ను పురస్కరించుకుని ఆదివారం అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సత్యం టాకీస్ చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషుకుమారి మాట్లాడుతూ.. దేశం కోసం ఉరికంబం ఎక్కిన అమరవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లన్నారు. ఆంగ్లేయులను గడగడలాడించిన ఈ అమరవీరుల సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ మాదవ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, సుమిత్‌సింగ్, జగత్‌సింగ్‌తో పాటు గురుద్వారా అధ్యక్షుడు దర్శన్‌సింగ్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రాంగోపాల్‌పేట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బీసీ బిల్లు, ఎస్సీ వర్గీకరణ తీసుకొచ్చినందుకు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం రాష్ట్రపతి రోడ్డులోని సిటీలైట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు దుండగులు చింపివేశారని ఆదివారం సిటీ లైట్ చౌరస్తాలో మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి దుండగులపై చర్యలు తీసుకోవాలని మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలతో ప్రజల ఆదరణ పొందుతుండడం చూసి బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఓర్వ లేకనే ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఫెక్సీలను చించివేసినంత మాత్రాన ప్రజల హృదయాల్లో నుంచి రేవంత్‌రెడ్డిని దూరం చేయలేరని హెచ్చరించారు. ఫ్లెక్సీని చించివేసిన వారితో పాటు సూత్రదారులపైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నజరీన్, ఎస్సీ సెల్ ఛైర్మన్ జి.ఎల్ రమేష్‌బాబు, హేమంత్ సింగ్ ఠాగూర్, మాణిక్యం ప్రభు, గంట సుదీర్, శివకుమార్, రహీం, సాధిక్, సురేష్, నారాయణ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, రాజేశ్వరి, అశ్విని, బుష్రా, మాధవి, తస్లీమ్, సభా, ఆనీఫ్, బబ్లు, మునీర్ పాల్గొన్నారు.

మీడియా, పోలీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్



మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్

బోయిన్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ మీడియా బోయిన్‌పల్లి పోలీస్ క్రికెట్ జట్ల మధ్య 15ఓవర్ల క్రికెట్ మ్యాచ్ బోయిన్‌పల్లి ఫైజాన్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం జరిగింది. ఈ మ్యాచ్‌కు ముఖ్యఅతిథులుగా బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ జంపన్న ప్రతాప్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్ హాజరై ప్రారంభించారు. ఈమ్యాచ్‌కి నర్మద మల్లికార్జున్ క్రికెట్ కిట్లను అందించగా, మాజీ నామినేట్ సభ్యుడు రామకృష్ణ బ్యాట్‌ను అందించి క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా బానుక నర్మద మల్లికార్జున్ మాట్లాడుతూ... నిత్యం పని ఒత్తిడిలో ఉండే పోలీసులు, మీడియా సభ్యులు అందరూ ఒకేచోట చేరి ఉల్లాసంగా ఆడడం సంతోషకరమని అన్నారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బోయిన్‌పల్లి పోలీస్ జట్టు 15ఓవర్లలో 96 పరుగులు చేయగా, 97 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన మీడియా జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 86 పరుగులు చేసింది. పోలీసుల జట్టులో సీఐ లక్ష్మీనారాయణరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మీడియా మ్యాచ్ ప్రారంభోత్సవం సందర్భంగా బానుక నర్మద సైతం బ్యాటింగ్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ప్రాంత ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, బోయిన్‌పల్లి పోలీసులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన పెరియోపరేటివ్ మెడిసిన్ సదస్సు

హైదరాబాద్ సిటీ, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్స రోగుల సమగ్ర సంరక్షణపై పెరియోపరేటివ్ మెడిసిన్ కాన్క్లేవ్ దృష్టి సారిస్తుందని ఏఐజీ ఆస్పత్రి చీఫ్ డాక్టర్ సునీల్ టి. పాండ్యాక తెలిపారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో రెండు రోజుల పెరియోపరేటివ్ మెడిసిన్ కాన్క్లేవ్ ఆదివారం సాయంత్రం ముగిసింది. సమావేశ వివరాలను డాక్టర్ పాండ్యాక వెల్లడించారు. సొసైటీ ఆఫ్ పెరియోపరేటివ్ ఫిజీషియన్ అనస్థీషియాలజిస్ట్ (సోప్ప), ఏఐజీ సంయుక్తంగా దీనిని నిర్వహించిందన్నారు. ఈ కాన్ఫరెన్స్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెరియోపరేటివ్ వైద్యులను ఒకచోట చేర్చిందన్నారు. శస్త్రచికిత్స అనంతరం రికవరీ ద్వారా డే కేర్ విధానాలుగా, సర్జికల్ క్రిటికల్ కేర్ మున్నగు అంశాల్లోనూ ఇందులో చర్చించినట్లు వివరించారు. శస్త్రచికిత్సా ప్రయాణం అంతటా వైద్య పరిస్థితులను నిర్వహించడం ద్వారా ఫలితాలను మెరుగు పర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, పెరియోపరేటివ్ మెడిసిన్ రోగి సంరక్షణలో కీలకమైన అంశంగా ఎక్కువగా గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జి.వి. రావు, సోప్ప అధ్యక్షుడు డాక్టర్ ఎన్.సత్యనారాయణ, కార్యదర్శి డాక్టర్ రాజా నర్సింగ్ రావు, డాక్టర్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

రామ్ మనోహర్ లోహియకు నివాళి



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డా. రామ్‌మనోహర్ లోహియ జయంతిని పురస్కరించుకొని తార్నాకలోని సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి ఆదివారం రామ్ మనోహర్ లోహియ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రొ. వెంకట్ రాజయ్య, కటికెల శ్రీహరి ముదిరాజ్, మహ్మద్ వజీద్ సిద్ధికి, బాలుయాదవ్, రిజ్వాన్ హుస్సేన్, గోవర్ధన్, తిరుపతి పాల్గొన్నారు.
- తార్నాక, మార్చి 23(ఆంధ్రజ్యోతి)

జీతాలు ఇవ్వండి



గాంధీ ఆస్పత్రి

- ఆందోళనలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది
- మూడు నెలలుగా ఇవ్వని వేతనాలు
- పట్టించుకోని సూపరింటెండెంట్
- నా వద్దకు రావద్దంటున్న ఏడీ
- కలెక్టర్ దగ్గరికి వెళ్లమని సూచన

అడ్డగుట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో సిబ్బంది ఉద్యోగులు హైరాన పడుతున్నారు. ఆస్పత్రిలో సాయి సేవా సుప్రీం, సాహితి, శ్రీరామ, సాయి సెక్యూరిటీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్ల కింద 207 మంది పనిచేస్తున్నారు.

2024 డిసెంబరు 30 వరకు ఈ నాలుగు కాంట్రాక్టర్ల గడువు ముగిసిపోవడంతో కొత్త సంవత్సరంలో మార్చి వరకు కొత్త కాంట్రాక్టర్ ఎవరూ రాలేదు. దీంతో వీళ్లకు రావాల్సిన మూడు నెలల జీతాలు ఇంతవరకు రాకపోవంతో హైరాన పడుతున్నారు. తినేందుకు తిండిలేదు, అద్దె కట్టేందుకు చేతిలో డబ్బులు లేవు, పిల్లల చదువుకు దూరమవుతున్నారని కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పని పరస్థితిలో పని చేయాల్సి వస్తోందని, ఇరవై ఏళ్ల నుంచి ఇక్కడ చావో బతుకో అన్నట్టు పనిచేస్తున్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరికీ రూ.15,600 రావాల్సి ఉండగా మూడు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై ఉద్యోగులు సూపరింటెండెంట్ రాజకుమారిని జీతాలు ఇవ్వండి అని అడిగితే.. కలెక్టర్ దగ్గరికి వెళ్లమని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇక లాభం లేదని గాంధీ ఆస్పత్రి ఏడీ దగ్గరికి వెళ్తే సూపరింటెండెంట్‌ను అడగండి అంటూ మాట దాట వేస్తున్నారు. తమకు రావాల్సిన పాత కాంట్రాక్టర్ల నుంచి డబ్బు వచ్చాయా? లేదా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొత్త కాంట్రాక్టర్ రావాలంటే టెండర్ వేయాలంటే మరో ఆరు నెలల సమయం పడుతోంది. ఈలోగా తమకు రావాల్సిన మూడు నెలల జీతాలు ఎవరు ఇస్తారో తెలియడంలేదని వాపోతున్నారు.

ఆస్పత్రిలో పనిచేస్తున్న తమ ఇబ్బందులను సూపరింటెండెంట్ పరిష్కరించాల్సి ఉండగా కనీసం తమపై చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల నుంచి జీతాలు రాలేదంటే ఆ బాధ దేవుడికి కూడా రావద్దంటే మానసికంగా వేధనకు గురవుతున్నారు.

బీజేపీ నేతను పరామర్శించిన గవర్నర్ దత్తాత్రేయ

అమీర్‌పేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్‌ను ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. అమీర్‌పేట శివబాగ్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజాసేవతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని శ్యామ్‌సుందర్‌కు సూచించారు. శ్యామ్‌సుందర్ త్వరగా కోలుకొని ప్రజలకు మరింత సేవ చేయాలని దత్తాత్రేయ పేర్కొన్నారు.

మున్నూరుకాపుల ఐక్యతను చాటాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు శ్రీనివాసరావు

బౌద్ధనగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపుల హక్కుల సాధన కోసం పోరాడి ఐక్యతను చాటాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాపు సోదర, సోదరిమణులు జీవితకాల సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపులు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపులను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సికింద్రాబాద్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చేపూరి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కొందరూ దుష్టశక్తులు సభ్యత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల నగేష్, గుండు సతీష్, ఎన్. గుల హరీష్, చామకూర సూజాత, అన్నపూర్ణ, నరేందర్, శంకర్, అనిల్, మహేశ్, దయానంద్, నర్సింగ్‌రావు, ప్రియ, జయశ్రీ పాల్గొన్నారు.

అంబర్‌నగర్‌లో ఇఫ్తార్ విందు



అంబర్‌నగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్ ఆల్‌కుబా మసీద్‌లో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ఇఫ్తార్‌ను స్వీకరించారు. కార్పొరేటర్ కంది శైలజ, బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

'నాలా పూడికతీత పనులు చేపట్టాలి'

బౌద్ధనగర్ డివిజన్‌లో నాలా పరివాహక ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం రాత్రి అంబర్‌నగర్ నాలాను కార్పొరేటర్ కంది శైలజతో పాటు ఆయన పరిశీలించారు. నాలా పూడిక తీతా పనులను వెంటనే చేపట్టాలని, ప్రజల భద్రతకు ఇబ్బంది కలగకుండా నాలాకు ఇరువైపులా రైలింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

మంచినీటి సమస్యకు వెంటనే పరిష్కారం



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన జలమండలి సిబ్బంది

అడ్డగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మురుగునీటినే తాగమంటారా? అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో మారేడుపల్లి జలమండలి అధికారులు స్పందించారు. తుకారాం గేట్ వెంకటనగర్‌లో కొన్ని రోజుల నుంచి మంచినీటి పైప్‌లైన్‌లో మురికి నీరు రావడంపై స్థానికులు జలమండలి యాప్‌లో ఫొటోలు పోస్టు చేసి ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం 12 గంటలోపే మారేడుపల్లి జలమండలి జీఎం వినోద్ ఆదేశాల మేరకు డిప్యూటీ జనరల్ మేనేజర్ విద్యాసాగర్‌తో పాటు అధికారులు, సిబ్బంది వెంకటనగర్‌కు చేరుకొని కొత్త పైప్‌లైన్ వేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జీఎం వినోద్ మాట్లాడుతూ.. తమ పరిధిలో మంచినీటి సమస్య ఉందని తెలిస్తే వెంటనే స్పందిస్తున్నామన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు యువతకు స్ఫూర్తి



రక్తదాన శిబిరంలో రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ అలోచనలు, ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని సనతనగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా మోండా డివిజన్ ఆదయ్యనగర్‌లో షహిద్ భగత్‌సింగ్ టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రక్తదానం శిబిరం ఏర్పాటు చేసిన టీంను, రక్తదానం చేయడానికి వచ్చిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు, సత్యనారాయణ, శ్రీకాంత్, ప్రమోద్, అమర్, నిర్వాహకులు నరేన్, లోకేష్, వంశీకృష్ణ, మనోజ్, అంకిత్‌రెడ్డి, లక్ష్మణ్, టిల్లు, చందు తదితరులు పాల్గొన్నారు.

తాడ్‌బండ్ వద్ద చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, మధుకర్

బోయిన్‌పల్లి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం సమీపించడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాడ్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదివారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, నాయకులు ముప్పిడి మధుకర్, నరేష్, సంతోష్ యాదవ్, సదానంద్ పాల్గొన్నారు.

రవి కాలనీని అభివృద్ధి చేయండి



తిరుమలగిరి రవి కాలనీ ఫేస్-2ను అభివృద్ధి చేయాలని ఆదివారం కంటోన్మెంట్ బోర్డు వార్డ్-7 మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో కాలనీ కమిటీ సభ్యులు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదను బోయిన్‌పల్లిలోని ఆమె నివాసంలో కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో కాలనీ ప్రెసిడెంట్ మల్లికార్జున రావు, కోశాధికారి శ్యామ్‌కుమార్, ఈసీ మెంబర్ చిన్న కృష్ణ పాల్గొన్నారు.
- తిరుమలగిరి, మార్చి 23 (ఆంధ్రజ్యోతి)

బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద..



భగత్ సింగ్ రాజ్‌గురు సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బోయిన్‌పల్లి వాసులతో జంపన్న ప్రతాప్

బోయిన్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జంపన్న ప్రతాప్ మాట్లాడుతూ దేశం కోసం 23 ఏళ్ల వయస్సులోనే తమ ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను నేటి యువత అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో మద్ది భాస్కర్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, దాదారావు, బి.కృష్ణ, ప్రకాష్ యాదవ్, ముత్యాలు, కరణ్ సింగ్, సాయి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ గౌడ్

బోయిన్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రాంతంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మహంకాళి జిల్లా ఆ పార్టీ అధ్యక్షుడు భరత్ కుమార్ గౌడ్ అన్నారు. మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత మొదటిసారిగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని బోయిన్‌పల్లిలో భరత్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాపూజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని బీజేపీ నాయకులను వారి కుటుంబ సభ్యులను కలిశా రు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ప్రేమ్ కుమార్ ముదిరాజ్, రాకేష్ కుమార్, రాయల కుమార్, బిజెపిశంకర్, వెంకటచారి పాల్గొన్నారు.

పరుగు పందెం వీరుడు కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సన్మానించిన శంకర్

అడ్డగుట్ట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 15కిలో మీటర్ల పరుగు పందెంలో కేవలం మూడు గంటల 10 నిమిషాల్లో పరుగపందాన్ని పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచిన తెలంగాణ ఎస్‌పీఏ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ఆదివారం అంబర్‌పేట్ శంకర్ సన్మానించి అభినందనలు తెలిపారు. ఇప్పటి వరకు పరుగు పందెం వీరుడు 97మారతాను పూర్తి చేసిన గచ్చిబౌలి కమిషనరేట్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మొదటిసారీ పోలీస్ అధికారులు ప్రశాంత్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇలాంటి పరుగు పందెం వంద మారతాన్లు పూర్తి చేయాలని సంకల్పంతో ఉన్నానని కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

పవర్‌బోర్ ప్రారంభం

అడ్డగుట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని అడ్డగుట్ట డీ సెక్షన్‌లో పవర్ బోర్‌తో పాటు సింటెక్స్ ట్యాంక్‌లను ప్రారంభించామని అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎక్కడ సమస్యలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని అన్నారు.

చింతబావిలో 'మేరా బూత్ మజ్ బూత్'

చిలకలగూడ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ చింతబావిలో ఆదివారం బీజేపీ కార్యకర్తల మేరా బూత్ మజ్ బూత్ పేరిట సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి, దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్ హాజరై మాట్లాడుతూ... పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని, బూత్‌లో ఓటర్ల జాబితాలో సవరణలకు చర్యలు చేపట్టాలని, బూత్‌లో సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చూడాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్‌కుమార్, బూత్ సభ్యులు పాల్గొన్నారు.

'దావత్ ఏ ఇఫ్తార్'ను రద్దు చేయాలి

- ప్రభుత్వాన్ని కోరిన జస్టిస్ చంద్రకుమార్
- ఆ డబ్బును అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజాగుట్ట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా ప్రజాధనంతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్బీ స్టేడియంలో హంగు, ఆర్భాటాలతో నిర్వహించే దావత్ ఏ ఇఫ్తార్ విందును రద్దు చేయాలని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ కోరారు. పండుగల పేరుతో దుబారా ఖర్చు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సామాజిక ఉద్యమకారిణి సొగరా బేగం అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ వర్గాలకు చెందిన వారు పాల్గొని మాట్లాడారు. రంజాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్ విందుతో సుమారు 70 కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఈ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అనుసరించిన పద్ధతిని ప్రస్తుత ప్రభుత్వం అనుసరించవద్దని పలువురు వక్తలు కోరారు. ప్రజాధనాన్ని వృథా చేయకుండా ప్రజాప్రతినిధులు తమ సొంత డబ్బులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇఫ్తార్ ఎలా జరగాలో తమ మత గ్రంథంలో రాసి ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు లుబ్నా సర్వత్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇఫ్తార్‌ను రద్దు చేయాలని ఇప్పటికే సీఎంకు లేఖ రాసినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అయేషా ఫాతిమా, ఖుద్సియా తబస్సుమ్, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ రఫీ, దాస్ రామ్ నాయక్, షేక్ సాహిదా బేగం, సనాఉల్లా ఖాన్, సైరా భాను, అబ్దుల్ జబర్ హైమద్ మతిన్, స్నేహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన అమర్‌సింగ్

అమీర్‌పేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ సికింద్రాబాద్‌కు వెళ్తున్న రాణీగంజ్ డిపోకు చెందిన సిటీ బస్సు ఎర్రగడ్డ బస్టాపు వద్దకు రాగానే నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడిని ఢీ కొట్టింది. దీంతో పాదచారుడు అదుపు తప్పి బస్సు చక్రాల కింద పడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు మద్యం తాగి ఉన్నాడని, అతని వయసు 35 ఏళ్లు ఉంటాయని పోలీసులు వెల్లడించారు. పేరు అమర్‌సింగ్ అని చెప్పినట్టు తెలిసిందని, పూర్తి వివరాలు తెలియవని పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా గుర్తిస్తే ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.



స్వాధీనం చేసుకున్న ఓజీ కుష్

ఓజీ కుష్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 203 గ్రాముల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 23(ఆంధ్రజ్యోతి): నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఓజీ కుష్ (హైడ్రో వీడ్) విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలో చల్లా నారాయణ శ్రీనిధి అనే వ్యక్తి ఓజీ కుష్ విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 101 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లికి చెందిన నరేందర్‌కుమార్ నుంచి ఓజీ కుష్ కొనుగోలు చేసినట్లు నారాయణ చెప్పడంతో నరేందర్ ఇంటిపై ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం దాడి చేసింది. అతడి ఇంట్లో 102 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది నరేందర్‌ను అరెస్ట్ చేశారు. నిందితులను ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లలో అప్పగించారు.

ఊరికి వెళ్లొచ్చే సరికి ఇంట్లో చోరీ

- 24 తులాల బంగారం, కిలో వెండి అపహరణ

బోయిన్‌పల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఊరికి వెళ్లొచ్చే సరికి ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. డీఐ సర్దార్ నాయక్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లిలోని సంచారపురి కాలనీలో నివాసం ఉంటున్న అంజిరెడ్డి గత నెలలో తన తల్లి మృతి చెందడంతో ఈనెల 17న మెదక్‌లోని చిన్న శంకరంపేట మండలం కామారం గ్రామానికి తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటి తాళాలు పగుల గొడుతున్న దృశ్యాన్ని గమనించిన స్థానికులు అంజిరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 24 తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు, 12 వేల రూపాయలు నగదు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ పోలీసులు డీఐ సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో చోరీ జరిగిన ప్రదేశాన్ని సీసీ కెమెరాల ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. గుర్తు తెలియని దండగుడు అర్ధరాత్రి వేళ ఇంట్లోకి ప్రవేశించినట్టు సీసీ కెమెరాలలో దృశ్యాలు నమోదయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.